నేడు 'డయల్ యువర్ డీఎం'

బోడుప్పల్: ఈనెల 18న 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చెంగిచర్ల డిపో పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 వరకు 7893088433 నంబర్‌కు కాల్ చేయాలని ఆమె కోరారు.

నాచారం అభివృద్ధికి నిధుల మంజూరు

మల్లాపూర్: నాచారం డివిజన్‌లోని శుభం క్లాసిక్ అపార్ట్‌మెంట్, కార్తీకేయనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత పత్రాలను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి కార్తీకేయనగర్ కాలనీవాసులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాచారం కాంగ్రెస్ నాయకులు మామిడాల సంతోష్‌రెడ్డి, ఎల్‌వీ.రావు, రిత్విక్ శర్మ, దివ్య కాంచన, శ్యామ్ సుందర్, వీరా రెడ్డి, ఎల్వీ.ప్రసాద్, శాస్త్రి, కనకయ్య, శరత్, ప్రమిత్, కిశోర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు జీలుగు నర్సింగరావు మృతి

మల్కాజిగిరి: మలిదశ ఉద్యమకారుడు, మల్కాజిగిరి ఎమ్మార్పీఎస్ విభాగం వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడు జీలుగు నర్సింగరావు (48) మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం ఆయన అదుపుతప్పి బైక్ పై నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. అతని అంత్యక్రియలు గురువారం ఎస్పీనగర్ శ్మశానవాటికలో జరిగాయి. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ కార్పొరేటర్లు జగదీశ్‌గౌడ్, మురుగేశ్, ఉద్యమకారులు వెంకన్న, ఉపేందర్, సతీశ్, బాబూరావు, నయూం ఖాన్, కాటం రాజు ఎమ్మార్పీఎస్ నాయకులు రాంచందర్ మాదిగ, మనోహర్ మాదిగ, వినయ్ మాదిగ తదితరులు నివాళులర్పించారు.

హామీలు అమలు చేయాలి

కుషాయిగూడ: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హెచ్‌బీకాలనీ, కైలాసగిరిలోని అంబేడ్కర్ విగ్రహాకు గురువారం వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని 250 గజాల స్థలం, పెన్షన్‌తో పాటుగా ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు రాంచర్ల బాల్‌నర్సయ్య, కటిక మోహన్, పాకాల ఎల్లయ్య, పంగ యాకుబ్, ఎర్ర సామ్సన్, బొల్లం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: బోనాల నేపథ్యంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అధికారులంతా వారివారి డివిజన్లలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, ఏసీపీలు చక్రపాణి, వెంకట్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేందర్, వాటర్ వర్క్స్ ఎండీ సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం

కుషాయిగూడ: ఈసీఐఎల్, కుషాయిగూడ, చక్రిపురం, చర్లపల్లిలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు నీటితో చెరువులను తలపించాయి. సాయినగర్, కృష్ణారెడ్డినగర్ కాలనీల్లోని ఇళ్లలోకి వరద చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ట్రాఫిక్ నిలిచి పోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. సాయినగర్ కమాన్ వద్ద భారీగా వర్షం నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

కాప్రా: కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్లలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షాకాలం ప్రారంభమైనా వరుణుడు కరుణించకపోవడంతో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ తరుణంలో కురిసిన భారీ వర్షానికి ఉపశమనం లభించినట్లైంది.



కాప్రాలో రోడ్డుపై పారుతున్న వరద

బోనాలకు సర్వం సిద్ధం

- 21న రామంతాపూర్‌లో ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ముస్తాబైన నెహ్రూనగర్‌లోని బద్ధి పోచమ్మ ఆలయం

రామంతాపూర్ : ఈనెల 21న నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలకు రామంతాపూర్ పరిధిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రామంతాపూర్ ప్రధాన రహదారిలోని 150 ఏళ్ల చరిత్ర గల నల్ల పోచమ్మ ఆలయం, దూరదర్శన్ వద్ద ఉన్న నల్ల పోచమ్మ, నెహ్రూనగర్‌లోని బద్ధి పోచమ్మ, ఓల్డ్ రామంతాపూర్‌లోని మహంకాళి, చిన్న చెరువు ప్రాంగణంలోని గంగమ్మ తల్లి, గోకుల్‌నగర్‌లోని పూర పోచమ్మ, రామ్ శంకర్‌నగర్‌లోని రక్త మైసమ్మ ఆలయంతో పాటు వివిధ అమ్మవారి దేవాలయాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. నెహ్రూనగర్‌లోని బద్ధి పోచమ్మ ఆలయంలో అమ్మవారి ఊరేగింపునకు నూతనంగా రథాన్ని సిద్ధం చేశారు. అదేవిధంగా మహంకాళి ఆలయంలో రంగం ఊరేగింపునకు ఏర్పాట్లు చేశారు. రామంతాపూర్‌లో ఆది, సోమవారాల్లో వివిధ అమ్మవార్ల ఆలయాల్లో నిర్వహించే బోనాల పండుగ ఫలహారం బండ్ల ఊరేగింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రామంతాపూర్ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బుర్ర రాజేశ్వర్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ



కార్మికులకు కిట్లు ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి గురువారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరం ప్రపంచస్థాయిలో పోటీ పడాలంటే పారిశుద్ధ్య కార్మికుల కృషి చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ బండారు శ్రీవాణి గురువారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌండిన్య గౌడ యువజన సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

యూజీడీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్ : డివిజన్ పరిధిలో యూజీడీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ బండారు శ్రీవాణి జల మండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వివిధ ప్రాంతాల్లో పాత పైప్‌లైన్లు మార్చి కొత్తవి ప్రారంభించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అందించిన అధికారిక లేఖను కూడా ఆమె ఎండీ అశోక్‌రెడ్డికి సమర్పించారు. అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీనిచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

ఇంట్లో చోరీకి యత్నం



సీసీ కెమెరాలో దొంగ పారిపోతున్న దృశ్యం

కుషాయిగూడ: ఇంట్లోకి దూరిని దొంగను యజమాని పట్టుకునేందుకు యత్నించగా తప్పించుకుని పారిపోయిన ఘటన కుషాయిగూడ పీఎస్ పరిధిలోని మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ హెచ్‌బీకాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్‌బిజీహెచ్-348 నివాసం ఉంటున్న రవీందర్ రెడ్డి ఇంట్లోకి బుధవారం అర్ధరాత్రి ఓ దొంగ దూరాడు. చోరీ చేసే క్రమంలో నిద్ర లేచిన రవీందర్‌రెడ్డి దంపతులు దొంగను పట్టుకునేందుకు యతి్నంచగా తప్పించుకుని పారిపోయాడు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలించగా దొంగ పారిపోతున్న దృశ్యాలు కనిపించాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా కాలనీవాసులు రాత్రి సమయంలో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే సొంతింటి కల సాకారం



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న నాయకులు

మేడిపల్లి: ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం త్వరగా నిర్మించుకుని బిల్లులు తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, దర్గ దయాకర్ రెడ్డి, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, బుచ్చియాదవ్, కనక దుర్గ, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కోనేటి వెంకట్ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జక్క వెంకట్ రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. సాయిప్రియకాలనీ బీజేపీ నాయకులు అమర్‌పటేల్‌తో పాటు మహేశ్, నాగరాజు రావు, ప్రశాంత్, ఆంజనేయులు పటేల్, సంతోష్, లక్ష్మారెడ్డి, అబ్దుల్, భాస్కర్, శంకర్ అశోక్, రవికాంత్ సునీల్, దామిరెడ్డి, గౌస్‌బాయి, కిశోర్, జోషఫ్, సునీల్ , రాంరెడ్డి, శ్యామ్యూల్, జోషఫ్, రవితో పాటు తదితరులు చేరారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు హైడ్రా కృషి

గౌతంనగర్: ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు హైడ్రా కృషి చేస్తుందని హైడ్రా ఇన్‌స్పెక్టర్ ఆదిత్య అన్నారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో గల సర్వే నంబర్ 868 లోని ప్రభుత్వ స్థలంలో స్థానికుల ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి తహసీల్దార్ సీతారాం, హైడ్రా తహసీల్దార్ హేమమాలినితో కలిపి గురువారం బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక్కడ సుమారు 3 వేల గజాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. దానిలో కొంతకాలంగా ఇండ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ చేస్తూ వ్యర్థాలను వేరు చేస్తున్నారని దాంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కాలనీవాసులు కరుణాకర్‌తోపాటు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రాతో పాటు మల్కాజిగిరి తహసీల్దార్ సీతారాంకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వారు వ్యర్థాల డంపింగ్‌ను అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో మల్లికార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటయ్య, అచ్యుతరావు, గోపాల్‌రెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్ ఉన్నారు.

నేడు కల్యాణోత్సవం

రామంతాపూర్ : చిన్న చెరువు ప్రాంగణంలోని గంగా లక్ష్మీ భవానీ ఆలయం 13వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు దీటి మల్లయ్య, పూస సత్తయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే, మేడ్చల్, ముషీరాబాద్ బండారి లక్ష్మారెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

కాంగ్రెస్ నేత యాదగిరి కన్నుమూత



రామంతాపూర్ : కాంగ్రెస్ సీనియర్ నేత రామంతాపూర్ నేతాజీనగర్ సంక్షేమ సంఘం సభ్యుడు బెజ్జం యాదగిరి (45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి రామంతాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తవిడబోయిన గిరిబాబు, డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ తదితరులు యాదగిరి పార్థీవ దేహం వద్ద సంతాపం తెలిపారు. పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడిగా పేరుపొందిన యాదగిరి మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆయన కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు సత్కారం



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గృహకల్ప కాలనీలో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల మంజూరుకు కృషి చేసిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయనను గృహకల్ప కాలనీలో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కిషన్, సోమేశ్వర్, మహేందర్‌రెడ్డి, భిక్షపతి, రాందాస్, ప్రహ్లాద్‌రెడ్డి బీజేపీ నాయకులు నాదం, నర్సింగరావు, ప్రభాకర్, లక్ష్మణ్, ఆనంద్‌గౌడ్, వెంకటేశ్వర్లు, గణేశ్, నాగమణి, హరినాయక్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మేడిపల్లి: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా చౌడూరు గ్రామానికి చెందిన పెనుమల శ్రీనివాస్ (45) బోడుప్పల్ ఆర్‌ఎన్‌ఎస్ కాలనీలో నివాసముంటూ..స్థానికంగా ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. సమస్యలు తీవ్రం కావడంతో మనస్థాపానికి గురై గురువారం సాయంత్రం గదిలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరక మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలాన్ని పరిశీలించిన హైడ్రా



స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

బోడుప్పల్: క్రాంతికాలనీలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ.. లే అవుట్ చేసినప్పుడు సదరు స్థలంలో పోస్టాఫీస్ కోసం స్థలం కేటాయించారని అయితే కొంతమంది దానిని కబ్జా చేశారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో స్థలాన్ని పరిశీలించామని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దండెం ఎల్లేశ్, ప్రధాన కార్యదర్శి రంజిత్‌గౌడ్, కోశాధికారి చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు ఇందిరా, కాలనీవాసులు సిద్ధులు, అగ్గి రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో వసతులు కల్పించాలి



రోగుల వద్ద వివరాలు సేకరిస్తున్న ఐద్వా నాయకులు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్రం ఆస్పత్రి (ప్రభుత్వ వైద్యా కళాశాల కుత్బుల్లాపూర్)లో వసతులు కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద కోరారు. ఆస్పత్రిలో రోగుల వద్ద గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మంగతో కలిసి మాట్లాడుతూ.. స్టాఫ్ నర్సులు, ఫార్మసీ సిబ్బంది, ఫోర్త్ క్లాస్ సిబ్బంది కొరత ఉందన్నారు. తక్షణమే ఖాళీలు భర్తీ చేపట్టాలన్నారు. అలాగే డిస్పెన్సరీలో మందులు సరిపడా లేవని, రోగులతో పాటు అటెండర్లు ఉండేందుకు షెడ్స్ లేవని స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి మెరుగైన సేవలు అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పద్మ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలి




అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మౌలాలి: మారుతీనగర్ చౌరస్తా నుంచి కీర్తి స్టోర్ సూపర్ మార్కెట్ వరకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందని, వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అజయ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం రోడ్డును తవ్వి, డ్రైనేజీ పైప్‌లైన్ వేసి మ్యాన్‌హోల్స్ అమర్చారన్నారు. అయితే తవ్విన రోడ్డు వల్ల గుంతలు ఏర్పడ్డాయని తక్షణమే పరిష్కరించాలని కోరగా అసిస్టెంట్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సీహెచ్ దశరథ్, మండల కార్యదర్శి యాదయ్యగౌడ్, సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, ఎస్కే అజీజ్, యాదగిరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం



కుషాయిగూడ: పెట్రోలియం ట్యాంకర్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని బీపీసీఎల్ యూనిట్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకోగా గురువారం బీపీసీఎల్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్ల రక్షణ కోసం ప్రత్యేక రవాణా కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో డ్రైవర్లకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు, నైపుణ్యం గల వారికి రూ. 36 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే చంద్రశేఖర్, కార్యనిర్వహక అధ్యక్షుడు జీ శ్రీనివాసులు, ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ బాధ్యుడు బంగారు నర్సింగరావు, బీవీ సత్యనారాయణ, రమేశ్, అశోక్‌గౌడ్, షరీఫ్, మల్లేశ్, ఆంజనేయులు, నాగస్వామి, చెన్నకేశవులు, మహేశ్, రాజారెడ్డి, ఖాజా, కుమారస్వామి, నాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.



రిపోర్టర్ల ముసుగులో ఇంటి యజమానికి బెదిరింపు

ఇద్దరు యూ ట్యూబర్లు, ఓ దినపత్రిక విలేకరిపై కేసు

ఘట్‌కేసర్: ఓ ఇంటి యజమానిని బెదిరిస్తున్న ఇద్దరు యూ ట్యూబర్లు, ఓ దినపత్రిక పేపర్ విలేకరిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన పడకంటి నర్సింహాచారి తన ఇంటిపై మూడో అంతస్తు నిర్మిస్తున్నాడు. ఈనెల 4న ఓ దినపత్రిక విలేకరి అని కార్తీక్, యూ ట్యూబర్ సుందర్‌తో కలిసి వేణు భవనం వద్దకు వెళ్లి తాను టీవీ చానల్ రిపోర్టర్ అని అలాగే ఎల్లన్నకి మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా పరిచయం చేసుకున్నారు. మూడో అంతస్తు నిర్మిస్తుందన్నందున రూ. 10 వేల చొప్పున ఇవ్వాలని, తమతో పాటు మరో 8 మంది ఉన్నారని డబ్బులు ఇవ్వకుంటే అధికారులకు చెప్పి కూల్చివేయిస్తామని హెచ్చరించారు. డబ్బులు లేవని చెప్పడంతో బెదిరించి వెళ్లిపోయారు. ఈనెల 15న మళ్లీ సుందర్ తన ఫోన్లో వార్త టైప్ చేసి వాట్సాప్ ద్వారా పంపి తామడిగిన డబ్బులు ఇవ్వకుంటే పేపర్‌లో వేస్తామని హెచ్చరించారు. అనంతరం పలుమార్లు సుందర్ బాధితుడికి ఫోన్ చేసి త్వరగా సెటిల్‌మెంట్ చేసుకోవాలని లేకుంటే ఇబ్బందులు తప్పవని, టీవీ చానల్ రిపోర్టర్ అసలు వినడం లేదని బెదిరించారని వాపోయాడు. దీంతో విసుగు చెందిన బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాగచంద్ర రెసిడెన్సీ వాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బండి గార్డెన్ ఎదుట నాగచంద్ర రెసిడెన్సీ అపార్టుమెంట్‌వాసులు సదరు బిల్డర్ తీరును నిరసిస్తూ మేడిపల్లి పోలీస్‌స్టేషన్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సువిని ఇన్‌ఫ్రా పేరుతో 5 అంతస్తులతో 30 ప్లాట్లుగా బిల్డర్ నిర్మాణం చేపట్టాడరన్నారు. మూడేళ్లుగా అంపూర్తిగా నిర్మాణం చేపట్టి తమను మోసం చేశాడని వాపోయారు. లిఫ్ట్ పనులు చేయలేదని, గ్రిల్స్ లేకపోవడంతో ప్రతిరోజు పెద్దలు, పిల్లలు, వృద్ధులు 5 ఫ్లోర్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిగిలిన పనులు చేయాలని బిల్డర్‌ను పలుమార్లు కోరగా తనకు ప్రభుత్వ పెద్ద అండదండలు ఉన్నాయని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. మరోవైపు అపార్ట్‌మెంట్ ఎదురుగా 15 ఫీట్ల రోడ్డును ఆక్రమించి మరో నిర్మాణం చేపట్టడంతో పాటు పార్కింగ్‌కు వదిలిన స్థలంలో జిప్టో కార్యకలాపాలు సాగిస్తున్నాడని తక్షణమే స్పందించి అసంపూర్తి పనులు చేయించాలని లేకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పూర్ణిమ, సంధ్య, నాగేశ్వర్ రావు, సురేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, కార్తీక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571